క్లుప్తంగా

పాఠశాలకు ఐరన్ గేటు అందజేత



ఐరన్ గేటును సమకూర్చిన పూర్వ విద్యార్థులు

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1997–98లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు పాఠశాలకు భద్రతగా ఉండేలా ఐరన్ గేటును సమకూర్చారు. ఏటా పాఠశాల అభివృద్ధికి ఏదోక రూపంలో సహకారం అందించాలని అనుకున్నార్నారు. దానిలో భాగంగా రూ.20 వేలు విలువైన గేటును బుధవారం పాఠశాల సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో నాగిరెడ్డి రాంబాబు, కోదూరి పల్లంరాజు, సలాది తాతారావు, ఆదివారపుపేట, చిన్నారావు, చిప్పాడ ప్రసన్న, పాలకొల్లు సుబ్రమణ్యం, గెద్దాడ శివ, రాజేంద్ర ప్రసాద్ తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌గా విశ్వేశ్వరరావు



విశ్వేశ్వరరావు

ఐ.పోలవరం: మండల తహసీల్దార్‌గా కాశీవిశ్వేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన జిల్లా కలెక్టరేట్ ఏవోగా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా ఉన్న డీఎల్ అనీల్‌కుమార్ గత శుక్రవారం బదిలీపై వచ్చారు. ఈయనను కలెక్టరేట్‌లో రిపోర్ట్ చేశారు. ఈయన చేరిన ఐదు రోజులలోనే తిరిగి బదిలీ కావడం విశేషం

సీఎం సహాయ నిధి అందజేత



చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

ఐ.పోలవరం: గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న ఒక చిన్నారికి మంజూరైన సీఎం సహాయ నిధిని ఆమె తల్లిదండ్రులకు బుధవారం అందించారు. తిల్లకుప్ప గ్రామానికి చెందిన మంచిగంటి యషిక ఆలివ్‌కు గుండె శస్త్ర చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ.2లక్షల మంజూరయ్యారు. ఈ చెక్కును ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పాప తండ్రికి అందించారు. ఈ కార్యక్రమంలో కడియం వెంకటేశ్వరావు, కడియం తంబయ్య, విజ్జల్ రాజు, జంపన బాబు, ముదునూరి రామలింగ రాజు, శ్రీనురాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లక్ష్మీనారాయణకు స్వాగతం



మంత్రి లక్ష్మీనారాయణను సత్కరించిన ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: యానాంలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే ముఖ్యఅతిథి పుదుచ్చేరి పీబడ్ల్యూడీ శాఖ మంత్రి లక్ష్మీనారాయణ బుధవారం విచ్చేశారు. పుదుచ్చేరి నుంచి వచ్చిన ఆయనకు రాజమహేంద్రవరం విమానాశ్రయంలో రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి దుశ్శాలువాతో సత్కరించి, ఘన స్వాగతం పలికారు. అదేవిధంగా ఎస్పీ రాజశేఖరన్, వివిధ శాఖల అధికారులు సైతం ఆయనకు స్వాగతం పలికినవారిలో ఉన్నారు.

15వ సారి స్టేట్‌హుడ్‌పై ఏకగ్రీవ తీర్మానం

యానాం: పుదుచ్చేరికి రాష్ట్రహోదా స్టేట్‌హుడ్ ఇవ్వాలంటూ అసెంబ్లీలో సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారని, దానిని తీసుకుని త్వరలో ప్రధాని, ఆర్థికమంత్రి, హోమ్ మంత్రి తదితరులను తాను వ్యక్తిగతంగా కలుస్తానని సీఎం రంగసామి పేర్కొన్నారు. బుధవారం అసెంబ్లీలో స్టేట్‌హుడ్ తీర్మానం అనంతరం ఆయన మాట్లాడారు. పుదుచ్చేరికి రాష్ట్రహోదా ఇవ్వాలంటూ కేంద్రప్రభుత్వాన్ని కోరే తీర్మానాలను ఆమోదించారన్నారు. ఈ మేరకు ప్రతిపక్షనేత శివ, డీఎంకే ఎమ్మెల్యేలు నజీమ్, సింథిల్‌కుమార్, కూటమి అనుకూల స్వతంత్ర ఎమ్మెల్యే నెహ్రూ తదితరులు వ్యక్తిగతంగా తీర్మానాలను ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఇది కొన్నేళ్లుగా అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 15వ సారి ఏకగ్రీవ తీర్మానమని సభ్యులు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ముమ్మిడివరం: విద్యార్థులు క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహమ్మతుల్లా పేర్కొన్నారు. ముమ్మిడివరం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ మోకా గణపతిరావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు దాసరిసత్యానారాయణ, ఎస్సై జ్వాలా సాగర్, ప్రిన్సిపాల్ కట్టా శ్రీనివాసరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్ అధ్యాపకులు పాల్గొన్నారు.

వంతెన శిథిలం

- యానాం–ద్రాక్షారామా రోడ్డులో శిథిలావస్థకు చేరిన వంతెన
- తూరల వద్ద పేరుకుపోతున్న చెత్త
- తక్షణమే పునర్నిర్మించాలని రైతుల డిమాండ్

తాళ్లరేవు: యానాం–ద్రాక్షారామా రహదారిలో ఇంజరం వద్ద ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. ఈ వంతెనను పునర్నిర్మించాలని స్థానిక ప్రజలతోపాటు శివారు ప్రాంతాల రైతులు ఎదురుచూస్తున్నారు. వంతెన శిథిలస్థితికి చేరుకోవడంతో తాత్కాలికంగా కల్వర్టు నిర్మించారు. అయితే వంతెన నిర్మాణం నేటికీ జరగకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

తూరలు వేయడంతో...

పిల్లంక సాగునీటి ప్రధాన కాలువపై బ్రిటీషు వారి కాలంలో యానాం–ద్రాక్షారామా రహదారిలో వంతెన నిర్మించారు. అయితే కొన్నేళ్ల క్రితం ఈ వంతెన కుంగిపోయి, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో తాత్కాలికంగా వాహనాల రాకపోకలతోపాటు సాగునీరు వెళ్లేలా భారీ తూరలను వేసి కల్వర్టు నిర్మాణం చేపట్టారు. అయితే అప్పటి నుంచి రైతులకు కష్టాల మొదలయ్యాయి. సాగునీటి సరఫరా కోసం వేసిన తూరల వద్ద చెత్త పేరుకుపోవడంతో నీరు పారని పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా మండల పరిధిలోని శివారు ప్రాంతాలకు సాగునీరందక ఖరీఫ్, రబీ పంటల్లో సైతం రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా తాళ్లరేవు, పి.మల్లవరం, పోలేకుర్రు, జార్జీపేట, నీలపల్లి, గాడిమొగ ప్రాంతాల్లోని శివారు భూములకు నీరు అందక రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ కాలువ పరిధిలో సుమారు ఆరు వేల ఎకరాల్లో వరిపంట సాగు చేస్తుండగా సుమారు రెండు వేల ఎకరాలకు పైగా నీటి ఎద్దడి నెలకొంటుందని రైతులు వాపోతున్నారు.

చెత్త పేరుకుపోవడంతో...

తూరల వద్ద రెండు, మూడు రోజుల కొకసారి చెత్తను తొలగిస్తున్నప్పటికీ సాగునీరు శివారు ప్రాంతాలకు చేరని పరిస్థితి నెలకొంటుంది. ముఖ్యంగా పంట చేతికి వచ్చే సమయంలో నీటి ఎద్దడి కారణంగా వరిచేలు ఎండిపోతున్నాయని, కనీసం ఇంజన్లు పెట్టుకున్నా నీరు అందని పరిస్థితులు నెలకొంటున్నాయని శివారు ప్రాంత రైతులు వాపోతున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, ఇతర ఖర్చులు పెరిగిపోయి ఇబ్బందులు పడుతుంటే సాగునీటిని తోడుకునేందుకు ఎకరాకు మరో రూ.5 వేల నుంచి రూ.7వేల వరకు అదనపు భారం పడుతుందని, తమ సమస్యలన్నింటికీ ప్రధాన కారణమైన ఇంజరం వంతెనను తక్షణమే నిర్మించి పూర్తిస్థాయిలో సాగునీరు అందేవిధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వంతెన నిర్మాణాన్ని చేపడతామని హామీ ఇచ్చారని, అయితే అది కార్యరూపం దాల్చడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



శిథిల స్థితికి చేరిన ఇంజరం వంతెన



ఇంజరం వంతెన వద్ద వాహనాల రాకపోకలకు తాత్కాలికంగా నిర్మించిన కల్వర్టు



చెత్త చెదారాలతో మూసుకుపోతున్న కల్వర్టు

జాతీయ జెండాల ప్రదర్శన



జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు



అయినాపురంలో త్రివర్ణపతాకం రెపరెపలు

అమలాపురం టౌన్: జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక దుడ్డివారి అగ్రహారంలోని ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు జాతీయ పతకాలను చేతపట్టుకుని నినదాలు చేశారు. జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, అసోసియేషన్ ప్రతినిధులు పప్పుల శ్రీరామచంద్రమూర్తి, జొన్నలగడ్డ గోపాల కృష్ణ, రంకిరెడ్డి కాశీ, కల్వకొలను బాబు, భుజంగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా అయినాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. సాంస్కృతిక వనరులు, శిక్షణా కేంద్రం న్యూఢిల్లీ సీసీఆర్‌టీ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. సర్పంచ్ మోకా రామారావు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ రేలంగి సూర్య వెంకట గౌడ్, గ్రామ పెద్దలతో పాటు సీసీఆర్‌టీ ట్రైనీ టీవీ కృష్ణారెడ్డి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రిసోర్స్ పర్సన్ కేవీఎస్ ఎస్ ప్రసాద్, మండల విద్యాశాఖాధికారులు బి.రమణ శ్రీ, రాయుడు ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: కామనగరువు ఆదిత్య పాఠశాలలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాంప్రసాద్ ఆధ్వర్యంలో 400 మంది విద్యార్థులతో అమలాపురం ఆర్టీసీ కాంప్లెక్స్ సెంటర్ నుంచి గడియారస్తంభం మీదుగా ముమ్మిడివరం గేట్ వరకు ర్యాలీ సాగింది. డీఈవో కమలకుమారి, డిప్యూటీ కలెక్టర్ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మధుసూదనరావు, ఇన్‌చార్జి డీవైఈవో సూర్య ప్రకాశం, సీఎంఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



గొల్లవిల్లి పాఠశాలలో జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం 78 మీటర్ల జాతీయ జెండాతో పాఠశాలలో ప్రదర్శన నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి దేశభక్తిని చాటారు. హెచ్‌ఎం లంకారాణి, పి.రామలక్ష్మి పీడీలు గొలకోటి ఫణి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సంబరాలకు సిద్ధం

అమలాపురం రూరల్: జిల్లా అంతటా 77వ స్వాతంత్ర్య దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలు, పలు సంస్థలు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయాల్లో ఏర్పాట్లు చేశారు.



ముస్తాబయిన కలెక్టరేట్

స్వాతంత్ర్య యోధులను స్మరించుకుందాం

అమలాపురం టౌన్: స్వాతంత్ర్య దినోత్సవం వేళ ఆ నాటి స్వాతంత్ర్య సమరంలో పాలు పంచుకున్న సమర యోధులను స్మరించుకుందామని ఏపీ రాష్ట్ర నారీ శక్తి కన్వీనర్ చిట్టూరి రాజేశ్వరి పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో అమలాపురంలో బుధవారం జరిగిన స్వాతంత్ర్య యోధుల వారసుల సన్మాన కార్యక్రమంలో రాజేశ్వరి మాట్లాడారు. ఇందులో భాగంగా స్వాతంత్ర్య సమరయోధుడు ఆకుల జోగయ్య మనమరాలు, అమలాపురం మున్సిపాలిటీ తొలి మహిళా చైర్‌పర్సన్‌గా రెండున్నర దశాబ్దాల కిందట పని చేసిన కల్వకొలను ఛాయాదేవిని ఘనంగా సత్కరించారు. తాతయ్య జోగయ్య నాడు స్వాతంత్ర్య సమరంలో పాలు పంచుకున్న ఘటనలను ఆయన మనమరాలు ఛాయాదేవి మహిళా మోర్చా సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చిలకమర్రి కస్తూరి, ప్రధాన కార్యదర్శి మోకా ఆదిలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షురాలు జగతా శాంతి, బీజేపీ సీనియర్ నాయకుడు ఆర్వీ నాయుడు తదితరుల ఆధ్వర్యంలో సన్మానించారు.



మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఛాయాదేవిని సత్కరిస్తున్న ప్రతినిధులు

అంతర్జాతీయ చెస్ క్రీడాకారిణికి సత్కారం



అంతర్జాతీయ చెస్ క్రీడాకారిణి సంధ్యను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

అమలాపురం టౌన్: రాజమహేంద్రవరానికి చెందిన అంతర్జాతీయ చెస్ క్రీడాకారిణి గోలి సంధ్య స్థానిక శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలోని విద్యార్థులు చెస్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంధ్యను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించి అభినందించింది. పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్ క్రీడా పోటీల్లో పలు క్రీడా రంగాలకు సంబంధించి ఆరు బంగారు పతకాలు సాధించిన భారతీయ క్రీడాకారులను సంధ్య అభినందించి జయహో భారత్ అంటూ విద్యార్థులతో కలిసి నినదించింది. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేవీఆర్ఎన్ నరసింహరావు , నల్లా సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ నల్లా పవన్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ కె.మనోహర్, ఏవో కరాటం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి

తాళ్లరేవు: రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చొల్లంగిలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం రైతులతో కలిసి వరిచేలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏఓ ఎన్.ప్రశాంతి, వీఏఏ వెంకటరమణ, అభ్యుదయ రైతులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రతి నియోజకవర్గంలో స్కిల్ హబ్బులు

ముమ్మిడివరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో స్కిల్ హబ్బులు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.లోకమాన్ తెలిపారు. స్థానిక సహకారంతో ప్రస్తుతం ఉన్న నూతన సాంకేతికాలను ఉపయోగించి పరిశ్రమలతో నైపుణ్యత గత ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తామన్నారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాలలో ఫేజ్–2గా మండపేట నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ద్విచక్ర వాహనాలు, అసిస్టెంట్ బ్యూటీ తెలిపిస్తే తెరపిస్టు కోర్సులకు శిక్షణ ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. కనీసరం 8వ తరగతి పాస్ కావాలని , అంత కన్నా ఎక్కువ చదువులు గాని చదివిన వారికి ఈ శిక్షణ తరగతులకు అర్హులన్నారు. ఇతర వివరాలకు 8099183854కు సంప్రదించాలని ఆయన సూచించారు.

పంచాయతీల అభివృద్ధికి దిశానిర్దేశం



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మండల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు



సర్పంచ్ విజయలక్ష్మికి సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు, జెడ్పీటీసీ గౌతమి

ముగిసిన సర్పంచులు, కార్యదర్శుల శిక్షణ

తాళ్లరేవు: ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళిక ద్వారా మూడు రోజులపాటు నిర్వహించిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణా కార్యక్రమం పంచాయతీల అభివృద్ధికి దిశానిర్దేశం చేసేలా ఉందని మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు, సుంకరపాలెం సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ చింతా మోహన్‌కృష్ణ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు శిక్షణను ఘనంగా నిర్వహించారు. గ్రామాలలో పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, స్ట్రీట్‌లైట్స్ నిర్వహణ తదితర అనేక అంశాలపై ఈఓపీఆర్‌డీ మల్లాడి భైరవమూర్తి, పంచాయతీ కార్యదర్శులు జేవీ రమణమ్మ, వీజేవీ రమణ తదితరులు వివరించారన్నారు.

సర్పంచులకు సర్టిఫికెట్ల ప్రదానం

అల్లవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల పాటు సర్పంచులు, కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. ఎంపీడీఓ కృష్ణమోహన్ అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమానికి ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి హాజరైయ్యారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రతి పంచాయతీలో ఘనంగా నిర్వహించాలని, పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడలు నిర్వహించి ప్రతిభ గల క్రీడాకారులకు బహుమతులు అందించాలన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న సర్పంచులకు ఎంపీపీ శేషగిరిరావు సర్టిఫికెట్లను అందజేశారు. సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు సాధనాల వెంకటరావు, దాకారపు చిరంజీవిరావు, సుందరనీడి సాయి, రాకాపు విజయలక్ష్మి, మల్లాడి మంగాయమ్మ, కొల్లు వెంకటరమణ, చిట్నీడి శ్రీదేవి, తోట శ్రీదేవి, బర్రే సీతారత్నం, బాలవేణి, సాధనాల సూర్యనాగమణి తదితరులు పాల్గొన్నారు.

జిప్‌మెర్‌లో వైద్యుల నిరసన



నిరసన తెలుపుతున్న వైద్యులు

యానాం: జిప్‌మెర్ రెసిడెంట్ డాక్టర్స్ అసోషియేషన్(జేఆర్‌డీఏ)పిలుపు మేరకు బుధవారం యానాం జిప్‌మెర్‌లో పీజీ ట్రైనీడాక్టర్లు నలుపు బ్యాడ్జీలు ధరించి విధులుకు హాజరయ్యారు. కోల్‌కతా ఆసుపత్రిలో ఆర్‌జీ కర్ మెడికల్ కళాశాల ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం చేసి అనంతరం ఆమెను పాశవికంగా హత్యచేసిన ఉదంతాన్ని నిరసిస్తూ వైద్యులు నిరసన వ్యక్తం చేశారు. వీరికి సీనియర్ వైద్యులు డాక్టర్ ఆనంద్‌రాజ్ తదితరులు సంఘీభావం తెలియజేశారు. అదేవిధంగా పుదుచ్చేరి జిప్‌మెర్‌లో సైతం 60 మంది జూనియర్ డాక్టర్లు విధులు బహిష్కరించారు.

పని కల్పించకపోతే ఉద్యమమే..

అమలాపురం టౌన్: ఉపాధి హామీ పథకంలో యంత్రాలతో నిర్వహిస్తూ సిమెంట్ పనులకు నిధులు మళ్లిస్తూ కూలీలకు అన్యాయం చేస్తున్నారని, కూలీలకు తగిన పనులు కల్పించకపోతే ఉద్యమం తప్పదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు హెచ్చరించారు. స్థానిక వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగిన సంఘం జిల్లా కమిటీ ప్రతినిధుల సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఉపాధి హామీ నిధులు మళ్లించి పథకాన్ని నీరుగార్చుతున్నారన్నారు. కూలీలకు అన్యాయం చేస్తే వ్యవసాయ కార్మిక సంఘం చూస్తూ ఊరుకోదని వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. సంఘం జిల్లా ప్రతినిధి తాడి శ్రీరామమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉపాధి హామీ పథకంలో నిధులు మళ్లింపుపైనే వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘం నాయకులు శ్రీనివాసరావు, వెంకటరావు తదితరులు మాట్లాడారు.

విద్యార్థులకు పోటీలు

అమలాపురం టౌన్: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలల విద్యార్థులకు పలు సాంస్కృతిక అంశాలపై బుధవారం పోటీలు నిర్వహించింది. పట్టణంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాస రచన, చిత్ర లేఖనం, పాటలు తదితర అంశాలపై పోటీలు నిర్వహించి వారిలోని ప్రతిభను వెలికి తీశారు. స్థానిక కొంకాపల్లి, వెత్సావారి అగ్రహారంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలు, హైస్కూలు సెంటరులోని జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, నల్లవంతెన వద్ద ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కె.శంకర్, కె.రుత్విక్ ఈ పోటీలను పర్యవేక్షించారు. పోటీల్లోని విజేలతకు ఈనెల 18న అమలాపురం యూటీఎఫ్ హోమ్‌లో నిర్వహించే కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రతినిధులు వసంతి, శశి, దిలీప్, జాషువా, సంతోష్, సాయి తదితరుల ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి.

యానాంలో పోస్టుల భర్తీకి చర్యలు

యానాం: యానాంలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి చర్యలపైన, వివిధ శాఖలకు సంబంధించి సమస్యలపైన తాను ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో అడిగిన ప్రశ్నలకు సంబంధించి ఆయా శాఖల నుంచి తనకు జవాబు ఇచ్చారని బుధవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న మున్సిపల్ కమిషనర్, మేనేజర్, జూనియర్ ఇంజినీర్, ఏఈ, తదితర పోస్టులను త్వరలో భర్తీ చేస్తామన్నారన్నారు. యానాం జిప్‌మెర్, జీజీహెచ్‌ల్లో యూపీఎస్సీ ద్వారా స్పెషలిస్టు డాక్టర్ల నియామకంపై అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారన్నారు. 47 ఖాళీల స్పెషలిస్టు వైద్యుల భర్తీకి మరో 130 పోస్టుల భర్తీ సింగిల్ విండో సిస్టమ్ ద్వారా నియామకానికి త్వరలో నోటిఫికేషన్ వేస్తామన్నారన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం యానాంలో అమలుకావడం లేదని, దీంతో దారిద్ర్యరేఖకు దిగువనున్న రోగులు వైద్యానికి ఇబ్బందులు పడుతున్నారని అడిగిన ప్రశ్నకు జవాబిచ్చారన్నారు. యానాంలో ఆయుష్మాన్ భారత్ చక్కగా అమలవుతోందని ఏపీలో 11 ప్రైవేట్ ఆసుపత్రులు, ఒక యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఏర్పాట్లు చేశామని, ఇప్పటికే 447 మంది రోగులకు మొత్తం రూ.80,88,00,849 చెల్లించామన్నారు. యానాంలో ఇంకా పెండింగ్‌లో ఉన్న 63 క్లెయిమ్‌లకు రూ.6,48,423 నిధులు విడుదల చేశామన్నారు. సాంఘిక సంక్షేమశాఖ ద్వారా వివాహాల కు ఇచ్చే సహాయాన్ని సైతం విడుదల చేశామన్నారు.

డెంగీ నివారణకు ఆయుర్వేద మందు

యానాం: యానాం పరిసర ప్రాంతాల్లో డెంగీ తదితర వైరల్ జ్వరాలను ఆయుర్వేదం ద్వారా తగ్గించేలా ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు ఆనందయ్య ప్రత్యేక మందును తయారు చేశారు. ఆ మందును ఆయన శిష్యుడు భాషా ద్వారా బుధవారం తనకు పంపారని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. డెంగీ మందు గురువారం నుంచి స్థానిక ఓల్డేజ్‌హోమ్ వద్ద రోగులకు పంపిణీ చేస్తామన్నారు.









